క్లుప్తంగా

ప్రధానోపాధ్యాయులుగా ఐదుగురికి పదోన్నతి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో అయిదుగురు ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులుగా విద్యాశాఖ నియమించింది. ఇందులో ఒకటో వార్డు బంగ్లామెట్టకు కోరాడ రామారావు, విల్సన్‌పేటకు సీహెచ్‌వీ సంతోష్, భీమిలి రెండో వార్డు స్కూల్‌కు సీహెచ్ నందగోపాల్, భీమిలి మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌కు వరహాలబాబు, పండిట్ నెహ్రూ ప్రాథమిక పాఠశాలకు టి.సతీష్‌లను ప్రధానోపాధ్యాయులుగా నియమించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: రేవిడి సబ్ స్టేషన్ పరిధిలో వ్యవసాయేతర ఫీడర్ పనులు చేపట్టనున్నందున పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. లింగన్నపేట, బొత్సపేట, బి.ఆర్.తాళ్లవలస, బుడ్డివలస గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన తెలిపారు.

కనులపండువగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



పార్వతీ పరమేశ్వరుల కల్యాణం చేస్తున్న వేద పండితులు

మీం పాలెం: స్థానిక ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులో గల శ్రీ శృంగేరి శంకర మఠంలో వెలసిన శ్రీ ఉమా సిద్ధేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని సాయంత్రం 6 గంటలకు ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని మఠం గౌరవ పరిపాలన ప్రతినిధి జగర్లపూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షించగా, వేద పండితులు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

మాతృమూర్తి పేరుతో మొక్కలు నాటండి



పెద్దిపాలెం విలేజ్ క్లినిక్‌లో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

తగరపువలస: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ నెల 5 నుంచి ఆగస్టు 15 వరకు ప్రతి ఒక్కరు మాతృమూర్తి పేరుతో మొక్కలు నాటాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆనందపురం మండలం పెద్దిపాలెం విలేజ్ క్లినిక్ వద్ద శుక్రవారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పాడ అప్పారావు, పీవీ ప్రసాదరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అనూష, ఏఎన్‌ఎం మంగ తదితరులు పాల్గొన్నారు.

పాండ్రంగిలో అగ్ని ప్రమాదం



పాండ్రంగిలో కాలిపోయిన పశువుల శాల

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు తాటాకు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. పాండ్రంగిలో కొనసర వారి కళ్లాల్లో జరిగిన ఈ ప్రమాదంలో బొబ్బిలి పకీర్, నారాయణ, పల్లి అప్పారావులకు చెందిన పశువుల పాకలు పూర్తిగా కాలిపోయాయి. నారాయణకు చెందిన ధాన్యం పురి దగ్ధమయింది.

అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

సరుగుడు పెంపకం.. ప్రశ్నార్థకం

- నిర్వహణ గాలికి..
- సాగర్‌నగర్ తీరంలో సరుగుడు మొక్కలు నాటిన అటవీ శాఖ
- ఏళ్లు దాటినా కనిపించని సరుగుడు తోట
- సంరక్షణ పేరిట లక్షల వృథా

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులోని సాగర్‌నగర్ తీరం వెంబడి అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సరుగుడు మొక్కల పెంపకం ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ఎండాకాలం తీవ్రత పెరిగినప్పటికీ, ఈ మొక్కలకు నీరు పోసే నాథుడు కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర కోత నివారణ, తుపాను గాలుల నుంచి తీర ప్రాంతాన్ని రక్షించే ఉద్దేశ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు, అటవీశాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అటకెక్కుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గాలికొదిలేసిన మొక్కల పెంపకం

గుడ్లవానిపాలెం ఫారెస్ట్ బ్లాక్ పరిధిలోని సాగర్‌నగర్ తీరం వద్ద 2004 జూలైలో 10 హెక్టార్ల మేర సరుగుడు షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్ పాయింట్ పేరుతో సరుగుడు, బాదం, ఇతర జాతుల మొక్కలను పెంచడానికి విశాఖ పోర్ట్ ట్రస్ట్ సీఎస్‌ఆర్ నిధుల నుంచి సుమారు రూ. 40 లక్షల విలువైన మొక్కలను అటవీశాఖకు అందజేసింది. ఈ మొక్కల పెంపకంతో పాటు, పది హెక్టార్ల భూమికి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని అప్పట్లో అటవీశాఖ అధికారులు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు కోసం మొక్కల పెంపకానికి రూ. 22 లక్షలు, ఫెన్సింగ్ కోసం రూ. 18 లక్షలు కేటాయించారు. అయితే మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణను గాలికి వదిలేశారని, దీంతో మూడు వంతుల మొక్కలు నీరు అందక ఎండిపోయాయి.



కనిపించని సరుగుడు తోట



నీరు అందక వాడిపోతున్న సరుగుడు మొక్కలు



సాగర్‌నగర్‌లో సరుగుడు షెల్టర్‌బెల్ట్ ప్లాంటేషన్ పాయింట్

అటవీశాఖ అధికారుల వైఫల్యంపై తీవ్ర ఆరోపణలు

మొక్కలు నాటిన తరువాత వాటి సంరక్షణలో అటవీశాఖ పూర్తిగా విఫలమైందని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొక్కల సంరక్షణ కోసం అక్కడక్కడ చలమలు తవ్వినా నీరు పడలేదు. దీంతో మంచి నీటి ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించి మొక్కలను సంరక్షించడం ప్రారంభించినా, అది కేవలం మూడు రోజుల ముచ్చటగానే మిగిలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. రోజుకు రెండు పూటలా మొక్కలకు నీరు అందించడంలో నిర్లక్ష్యం వహించారని, బయట నుండి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసి మొక్కలను సంరక్షిస్తున్నామని క్రింది స్థాయి సిబ్బంది అధికారులకు తప్పుడు లెక్కలు చూపించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, కాస్తో కూస్తో బతికి ఉన్న సరుగుడు మొక్కల చుట్టూ కూడా కలుపు తీయకుండా వదిలేయడంతో అవి కూడా చనిపోయే స్థితికి చేరుకున్నాయని, మరికొన్ని మొక్కలు నాటినప్పుడు ఎలా ఉన్నాయో ఇప్పుడు కూడా అలానే కనిపిస్తున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. మొక్కలకు నీరు పోసి సంరక్షిస్తున్నట్లుగా మొక్కల మధ్య కొన్ని పైపులు, సిమెంటు తొట్లు ఏర్పాటు చేసినప్పటికీ, అవి కూడా అలంకార ప్రాయంగానే మిగిలిపోయాయి.

అటవీశాఖ నిర్లక్ష్యం

అధికారులు ఒక్కసారైనా ఈ మొక్కల పెంపకాన్ని పరిశీలించి, ఎన్ని మొక్కలు వేశాం, ఎన్ని మొక్కలు చనిపోయాయని పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ కొన్ని చోట్ల తుప్పు పట్టి పోగా, మరికొన్ని చోట్ల ఫెన్సింగ్ కనిపించకుండా పోవడం కూడా అటవీశాఖ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇంత అవినీతి, నిర్లక్ష్యం జరుగుతున్నా అధికారుల్లో చలనం కనిపించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి, జరుగుతున్న అవినీతి, నిర్వహణ నిర్లక్ష్యంపై విచారణ జరిపించి మొక్కలను సంరక్షించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటారా? వేచి చూడాలి.

పుస్తకాల స్టాకు పరిశీలన



చంద్రపాలెం జెడ్పీ హైస్కూల్లో పుస్తకాల స్టాకును పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి దేవానందరెడ్డి

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర స్టాక్ పాయింట్‌ని జిల్లా ప్రత్యేక అధికారి దేవానంద రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందించాల్సిన బ్యాగు, పుస్తకాలు, యూనిఫారం, బెల్ట్ తదితర సామగ్రిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీఎంవో పైలా దేముడుబాబు ఉన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం. వెంకటరావు, ఉపాధ్యాయులు రత్నరాజు, శంకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేజీహెచ్‌లో కొత్త నిర్మాణాలు ప్రారంభం

అల్లిపురం: కేజీహెచ్‌లో శనివారం పలు కొత్త నిర్మాణాల ప్రారంభోత్సవం జరగనున్నదని సూపరింటెండెంట్ పి.శివానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీహెచ్ ఆవరణలో మార్చురీ వద్ద నిర్మించిన పోలీస్ అవుట్ పోస్ట్, టిస్లా సెంటర్ వద్ద రోగుల నిరీక్షణ షెడ్లు, ఫార్మసీ వద్ద రోగుల నిరీక్షణ షెడ్లకు ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ హరేందిరప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొంటారని పేర్కొన్నారు.

నర్శింహస్వామి కొండపై విత్తన బంతులు చల్లే కార్యక్రమం

భీమునిపట్నం: భీమిలి నర్శింహస్వామి కొండపై శుక్రవారం మిషన్ గ్రీన్ భీమిలి, ఐఎన్‌ఎస్ కళింగ సిబ్బంది సంయుక్తంగా విత్తన బంతులు చల్లే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింత, వేప, సీతాఫలం, నేరేడు, రేగి, మర్రి, జామ మొదలైన చెట్లకు సంబంధించిన విత్తన బంతులను కొండపైన పలు ప్రాంతాల్లో చల్లారు. మిషన్ గ్రీన్ భీమిలి సభ్యులు ముమ్మిడిశెట్టి ఆదిత్య మాట్లాడుతూ ఇప్పటికే వేలాది విత్తనాలు చల్లామని, మళ్లీ వర్షాకాలం వస్తున్నందున మళ్లీ వీటిని చల్లుతున్నామని అన్నారు. దీనికి ఐఎన్‌ఎస్ కళింగ కూడా సహకరిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల హెలికాప్టర్ ద్వారా విత్తనాలు చల్లారని తెలిపారు. ఇందులో సభ్యులు గుల్లల వెంకటేష్, కాళ్ల సన్నీ, విజ్జపు సత్యనారాయణ, ముసునూరి శ్రీనివాస్, కట్టమూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కొండపై విత్తనాలతో మిషన్ గ్రీన్ భీమిలి, ఐఎన్‌ఎస్ కళింగ సిబ్బంది

బీఎస్‌ఎన్‌ఎల్‌తో ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ అవగాహన ఒప్పందం

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ బీఎస్‌ఎన్‌ఎల్‌తో శుక్రవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థులు, అధ్యాపకుల అభ్యాసాలను ఆధునిక సాంకేతిక రంగాలలో మెరుగుపరచుకునేందుకు ఉద్దేశించినది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్, రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ, జనరేటివ్ ఎ1, డిజిటల్ ట్విన్, ఇండస్ట్రీ 4.0 సంబంధిత భావనలపై దృష్టి పెట్టినట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. అంతే కాకుండా విద్యార్థులకు పరిశ్రమ అనుభవం, ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభించనున్నాయన్నారు. విద్యా వ్యవస్థ, పరిశ్రమల మధ్య గాఢమైన అనుసంధానాన్ని సాధించేందుకు ఇది మంచి దారిని సృష్టిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, సీఎంవో పీఎస్ రాజు తదితరులు పాల్గొని విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో బీఎస్‌ఎన్‌ఎల్ మద్దతు విలువైనదని, ఈ భాగస్వామ్యం ద్వారా డిజిటల్ యుగానికి అనుగుణంగా విద్యార్థుల సాంకేతిక సామర్థ్యాలు పెంపొందించడానికి మరిన్ని అవకాశాలు లభిస్తాయన్నారు.



అవగాహన ఒప్పందాన్ని మార్చుకుంటున్న బీఎస్‌ఎన్‌ఎల్, ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ సిబ్బంది

రుణ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలి

భీమునిపట్నం: బ్యాంకు అందిస్తున్న రుణ సదుపాయాన్ని అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ నర్సింహకుమార్ అన్నారు. భీమిలిలో శుక్రవారం మండల పరిధికి చెందిన మహిళా సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. మహిళలు స్వయం ఉపాధి పొందడానికి పలు రకాలైన రుణ సదుపాయాలను అందిస్తున్నామని వాటిని వినియోగించుంటే మంచి లాభాలు పొందవచ్చని అన్నారు. రైతులకు కూడా పలు రకాలైన పంటలు పండించుకోవడానికి అవసరమైన రుణాలు ఇస్తున్నామని, మత్స్యకార మహిళలకు చేపల విక్రయాలకు అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా రుణాలు మంజూరైన మహిళలకు బ్యాంక్ రీజినల్ హెడ్ వాటిని అందించారు. వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయప్రసాద్, ముఖ్య అధికారులు నాగభూషణం, నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



రుణాలు అందిస్తున్న నర్సింహకుమార్

కమ్యూనిస్ట్ నేత చంద్రకు ఘన నివాళి

మధురవాడ: కమ్యూనిస్ట్ నేత, సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతిని మధురవాడ సీపీఐ కార్యాలయం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ సీఆర్ గొప్ప కమ్యూనిస్ట్ నాయకుడని, కార్మిక కర్షకుల పక్షాన ఉద్యమాలే కాక దేశ శాంతి సమగ్రతలు కాపాడడం కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. సోవియట్ యూనియన్ ఆర్డర్ ఆఫ్ లెనిన్, బల్గేరియా ఆర్డర్ ఆఫ్ డెమిట్రో అవార్డులతో ఇతర దేశాల్లో పలు అవార్డులు అందుకున్నారన్నారు. కమ్యూనిస్ట్ ఉద్యమం కోసం పని చేయడమే ఆయనకి అర్పించే నిజమైన నివాళి అని పైడిరాజు అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొల్లి మేఘరావు, పి. కాంతమ్మ, జి. వేశంగినిరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రకు సీపీఐ నాయకుల నివాళులు..

తగరపువలస: సీపీఐ తొలితరం నాయకుడు చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతి సందర్భంగా ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన గురించి గుర్తు చేసుకున్నారు. 25 సంవత్సరాల పాటు ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీ నాయకునిగా ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. దున్నేవాడికే భూమి దక్కాలని పోరాటాలు చేసి కార్మిక, కర్షక పోరాట యోధునిగా గుర్తింపు పొందారన్నారు. 1964లో కమ్యూనిస్ట్ పార్టీలో చీలికల తర్వాత సీపీఐకి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై పార్టీని 28 ఏళ్ల పాటు ముందుకు నడిపించారన్నారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో భీమిలి ఏరియా పార్టీ కార్యదర్శి కానూరి రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు తదితరులు ఉన్నారు.



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పైడిరాజు తదితరులు

విద్యార్థులకు అభినందన

కొమ్మాది: ఇటీవల ప్రకటించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రతిభా పరీక్షలలో జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు చిన ఉప్పాడ ఎంపీయూపీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. వీరిలో సీహెచ్‌వై సుప్రజ్ జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించగా సీహెచ్ రాజ్‌కుమార్ 20వ ర్యాంకు, వి.తేజశ్విని 36వ ర్యాంకు సాధించారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయుడు ఈశ్వర్‌రెడ్డి తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న చిన ఉప్పాడ ఎంపీయూపీ పాఠశాల యాజమాన్యం

ప్రశాంతంగా డీఎస్సీ

తగరపువలస: శుక్రవారం నుంచి ప్రారంభమైన డీఎస్సీ–2025 పరీక్షలకు గాను ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ కేంద్రంగా తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇక్కడ 200 మంది అభ్యర్థులకు గాను 171 మంది పరీక్షకు హాజరయ్యారు. నియోజకవర్గంలో నాలుగు చోట్ల పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో కొమ్మాది గాయత్రి ఇంజినీరింగ్ కళాశాల, రుషికొండ గాయత్రి ఇంజినీరింగ్ కళాశాల, కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాల, శొంఠ్యాం ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల ఉన్నాయి.

మధురవాడ/కొమ్మాది: మధురవాడ జోన్ పరిధిలోని మధురవాడ, కొమ్మాది, రుషికొండలలో డీఎస్సీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్టు అధికారులు తెలిపారు. మధురవాడ గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో 100మందికి 96మంది, కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో 85కి 80మంది, రుషికొండ గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో 200కి 173మంది చొప్పున హాజరయ్యారు.



మధురవాడ గాయత్రి ఇంజినీరింగ్ కళాశాల వద్ద నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



రుషికొండ గాయత్రి వద్ద హాల్ టికెట్లు చెక్ చేసి లోపలికి అనుమతిస్తున్న సిబ్బంది



కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాల వద్ద హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

పేపర్ ఈజీగానే ఉంది..



ప్రిపేర్ అయి పరీక్ష రాస్తే బాగానే ఉంది. టీచింగ్ ఫీల్డ్ నుంచి కొన్నాళ్లు బయట ఉన్నాను. బాబు చదువు కారణంగా కొన్నాళ్లు గ్యాప్ ఇవ్వాల్సి వచ్చింది. మళ్లీ ఈ ఫీల్డ్‌లోకి వస్తానన్న నమ్మకం ఉంది. పేపర్ ఈజీగానే ఉంది. నేను సింహాచలం నుంచి ఇక్కడికి పరీక్షకి వచ్చాను.

– టి. గాయత్రి, సింహాచలం

టైం సరిపోలేదు..



ఈ రోజు మ్యాథ్స్ పరీక్ష బాగానే రాశాను. పేపర్ బాగానే ఉంది. ఇంగ్లీషు మీడియం చదివే వాళ్లకి మరింత బాగుంది. ఇంగ్లీషు పరీక్ష రాయడం కాస్త కష్టం అయింది. టైం కూడా సరిపోలేదు.

– జి. వేణుమాధవి, సీతమ్మధార

సుత్తమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు వేకువ జాము నుంచి పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిప్పాడ పంచాయతీతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు, ప్రజాప్రతినిధులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. రెండేళ్లలో ఈ ఆలయాన్ని పూర్తి చేయనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్లకు మోకాలడ్డు

తగరపువలస: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు భీమిలిలోని యాజమాన్యాలు అడ్డు తగులుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనారిటీ, తక్కువ ఆదాయం గల కుటుంబాల చిన్నారులకు 25 శాతం సీట్లు కేటాయిస్తూ పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. అయినప్పటికీ సీట్లు కేటాయించబడిన పాఠశాలలు వివిధ కారణాలు చెప్పి అడ్మిషన్లకు వచ్చిన తల్లిదండ్రులను తిప్పి పంపుతున్నాయి. దీనిపై విద్యాశాఖ అధికారులు మౌనం వహిస్తుండటంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ నిషేధం.. ప్రచారానికే పరిమితం



సాగర్‌నగర్ వద్ద విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల వినియోగం

కొమ్మాది: ఈ ఏడాది జనవరి 1 నుండి ప్లాస్టిక్ నిషేధం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. దానిపై ఓ నెల ముందుగానే కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కానీ ఇంత చేసినా ఇప్పటికీ ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. దీనికి ప్రత్యక్ష సాక్ష్యమే జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో ప్లాస్టిక్ కవర్లు కూరగాయలతో కట్టి యథేచ్ఛగా విక్రయాలు జరగడం. సచివాలయానికి కాస్త దూరంలోనే ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. అంతే కాదు సాగర్ నగర్‌లో చికెన్ దుకాణాలు, టిఫిన్ సెంటర్ల వద్ద కూడా పాలిథిన్ కవర్లతో విక్రయాలు కొనసాగుతున్నాయి. వాస్తవానికి జీవీఎంసీ అధికారులు పాలిథిన్ విక్రయాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలి. ఎప్పటికప్పుడు దుకాణాలను, టిఫిన్ సెంటర్లను తనిఖీ చేయాలి. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర, హరిత విశాఖ అంటూ ప్రచారాలు చేస్తున్నారు తప్ప నిర్వహణ చర్యలు మాత్రం శూన్యమని పలువురు ఆరోపిస్తున్నారు.

కిశోర బాలికలకు వ్యాయామం, క్రీడలు అవసరం

మద్దిలపాలెం: కిశోర బాలికలు శారీరకంగా దృఢంగా ఉండేందుకు, ఆరోగ్యానికి వ్యాయామంతో పాటు క్రీడలు అవసరమని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ ఏసీడీపీవో శ్రీలత అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేఆర్‌ఎం కాలనీ–1 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు ఆటలు, వ్యాయామంపై ఆమె అవగాహన కల్పించారు. విద్యతోపాటు క్రీడలు, వ్యాయామం ఎంతో అవసరమన్నారు. పౌష్టికాహారం లాభాల గురించి తెలియజేశారు. ఈ అంశాల్లో బాలికల సందేహాలను తెలుసుకుని, వాటి నివృత్తి చేశారు. మద్దిలపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ సెల్వియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఆర్. సుబ్బలక్ష్మి, ఎంఎస్‌కే, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్, కిశోర బాలికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీవో శ్రీలత

చైతన్యంతోనే పర్యావరణ పరిరక్షణ

పరవాడ: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా వాడచీపురుపల్లి, వెన్నలపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ విజయశేఖర్ శుక్రవారం తనిఖీ చేశారు. వీటి కార్యకలాపాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సంపద తయారీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. వ్యర్థాలను విలువైన వస్తువులుగా మార్చే చర్యలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. సందర్శనలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం సంపద తయారీ కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ప్రకాష్, ఈవోఆర్డీ వి.ధర్మారావు, వెలుగు ఏపీఎం రంగారావు, వాడచీపురుపల్లి, వెన్నలపాలెం పంచాయతీ కార్యదర్శులు అచ్యుతరావు, భారతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సంపద తయారీ కేంద్రాలను సందర్శించిన విజయశేఖర్ తదితరులు